ఓ భవన నిర్మాణదారుడి నిర్లక్ష్యం
బ్రాహ్మణవాడి వాసులకు నరకం

3, 4 వీధుల్లో స్తంభించిన సివరేజీ వ్యవస్థ

- నిత్యం మురుగు పరుగు
- కలుషితంగా తాగునీరు
- మురుగుమయంగా రహదారులు

బేగంపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఓ భవన నిర్మాణదారుడి నిర్లక్ష్యం వేలాది కుటుంబాలకు శాపంగా మారింది. మ్యాన్‌హోల్‌లో కాంక్రీట్ పోయడంతో బేగంపేట బ్రాహ్మణవాడిలోని 3, 4 వీధుల్లో సివరేజీ వ్యవస్థ స్తంభించింది. దీంతో నెల రోజులుగా మురుగునీటితో నరకయాతన అనుభవిస్తున్నా.. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంలో అధికారులు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాహ్మణవాడి 3,4 వీధుల్లో ఉన్న డ్రైనేజీ లైన్స్‌లోకి కుందన్‌బాగ్ రైల్వేలైన్ కింద నుంచి మురుగునీరు వచ్చి కలుస్తోంది. దీంతో నెల రోజులుగా ఈ వీధుల్లో మురుగు పొంగుతుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



బ్రాహ్మణవాడి వీధి నెం.3,4లలో పొంగుతున్న మురుగునీరు



కాంక్రీట్‌తో పేరుకుపోయిన మ్యాన్‌హోల్

కాంక్రీట్ కలపడంతోనే సమస్య..

ఈ ప్రాంతంలో భారీ అపార్ట్‌మెంట్‌లు నిర్మిస్తున్న వ్యక్తి పిల్లర్ పనులు పూర్తి చేసి మిగిలిన కాంక్రీట్, సిమెంట్ మిక్సింగ్‌లను అక్కడే ఉన్న ఓ డ్రైనేజీ మ్యాన్ హోల్‌లో విడిచిపెట్టారు. దీంతో మొత్తం సివరేజీ లైన్లు అన్నీ స్తంభించిపోయాయి. మూడో వీధిలోని డ్రైనేజీ లైన్‌లో కాంక్రీట్ కలపడంతో పైపులు నిండిపోయి మురుగునీరు కిందకు వెళ్లే అవకాశం లేక ఇళ్లలోకి చేరుతోంది. దీని ప్రభావం సమీపంలోని 4వ వీధిపై కూడా పడింది. పలు వీధుల్లోకి మురుగు నీరు చేరుతోంది. రహదారుల్లో మురుగునీరు పొంగి ప్రవహించడంతోపాటు భారీ వర్షాలు కురిసినప్పుడు ఇక్కడ ఉన్న వందలాది కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

డ్రైనేజీ పైపుల్లో సిమెంట్ బండలు

సీవరేజీ సమస్యపై స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు భారీ ఎయిర్‌టెక్ మిషన్ ద్వారా 3వ వీధిలో క్లీనింగ్ పనులు చేపట్టారు. ఇక్కడ డ్రైనేజీ క్లీనింగ్ చేస్తుండగా సిమెంట్ బండలు బయటపడడంతో అధికారులు వాటర్ వర్క్స్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా, సదరు బిల్డర్‌పై చర్యలు తీసుకునేందుకు అధికారులు ఎందుకు వెనకడుగు వేస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. దీంతోపాటు 3వ వీధిలోని సగం డ్రైనేజీ లైన్ పూర్తిగా జామ్ అవడంతో మురుగునీరు వెళ్లే అవకాశం లేక వెనకకు వచ్చి ఇళ్లలోకి చేరుతున్నాయి. 3వ వీధిలో ఉన్న డ్రైనేజీ లైన్ పూర్తిగా సిమెంట్ కాంక్రీట్‌తో జామ్ అయిందని, దాని స్థానంలో కొత్త లైన్ వేయడం వల్లనే సమస్యకు పరిష్కారం లభిస్తుందని స్థానికులకు వాటర్ వర్క్స్ అధికారులు చెప్పారు.

బిల్డర్‌పై చర్యలు తీసుకోవాలి



డ్రైనేజీ లైన్లు జామ్ అవడానికి కారణమైన బిల్డర్‌పై చర్యలు తీసుకోవాలి. నెల రోజుల నుంచి నిత్యం మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుంది. వర్షం వచ్చిందంటే మురుగునీరు ఇళ్లలోకి వస్తున్నాయి. డ్రైనేజీ లైన్‌లో సిమెంట్ బండలు బయటపడినా బిల్డర్‌పై చర్యలు తీసుకోకపోవడం దారుణం. దీనిపై ఇటీవల సీఎం ప్రజావాణిలో ఫిర్యాదు చేశాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

\- చెక్కల సుభాష్ ముదిరాజ్, బ్రాహ్మణవాడి

మురుగు సమస్యను పరిష్కరించాలి



బ్రాహ్మణవాడి 3,4 వీధుల్లో నెలకొన్న మురుగు సమస్యను వెంటనే పరిష్కరించాలి. నెల రోజులుగా ప్రజలు మురుగునీటితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణం. తాత్కాలిక చర్యలు కాకుండా దీనికి శాశ్వత పరిష్కారం చూపాలి. భవనాలు నిర్మించుకునే వారు వ్యర్థాలను డ్రైన్‌లలో వేయవద్దు. అలా వేసిన వారి పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి.

\- సురేష్ యాదవ్, బేగంపేట

సీఎం ప్రజావాణిలో ఫిర్యాదు

ఇటీవల బ్రాహ్మణవాడి కాలనీ వాసులు సమస్యను పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రి ప్రజావాణిలో వినతిపత్రం ఇచ్చారు. డ్రైనేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. అనంతరం మంత్రి దామోదర రాజనర్సింహకు కూడ వినతిపత్రం ఇచ్చారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెండు రోజుల కిందట వాటర్ వర్క్స్ ఉన్నతాధికారులు ఈ ప్రాంతంలో పర్యటించి సమస్యను తెలుసుకున్నారు.

మైత్రీవనం బిల్డింగ్ సెల్లార్‌లో
పేరుకుపోయిన చెత్తాచెదారం, బురద

- ఉదయం ఈగల మోత.. రాత్రి దోమల బెడద
- గేట్ల మూసివేతతో సాగని వ్యాపారాలు

అమీర్‌పేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల వాణిజ్య కేంద్రమైన అమీర్‌పేట సర్కిల్‌లోని మైత్రీవనం బిల్డింగ్ సెల్లార్ లోకి వరద నీరు భారీగా చేరింది. చెత్తాచెదారంతో పాటు నాలాలోని బురద చేరింది. వరదతో కొట్టుకు వచ్చిన బురద, చెత్త మురిగి పోయి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ఉదయం వేళ ఈగల మోత, రాత్రివేళ దోమల బెడదతో వ్యాపారులు అల్లాడుతున్నారు. చినుకు పడితే చాలు ఈ భవనంలోకి ఎవరూ రాకుండా ఇరువైపులా ఉన్న గేట్లను మూసివేస్తున్నారు. దీంతోపాటు విద్యుత్ మీటర్ రూమ్ కూడా సెల్లార్లో ఉండడంతో కరెంట్‌ను నిలిపివేస్తుండడంతో వ్యాపారాలు చేసుకోలేకపోతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి సెల్లార్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారం, బురదను తొలగించాలని పలువురు వ్యాపారులు కోరుతున్నారు.



మైత్రీవనం బిల్డింగ్ సెల్లార్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారం, బురద



మజీద్ గడ్డలో స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ దేదీప్యవిజయ్

వర్షాల నేపథ్యంలో ఇబ్బందులు లేకుండా చర్యలు

పంజాగుట్ట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల స్థానికులకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్యవిజయ్ అన్నారు. సోమవారం డివిజన్‌లోని జవహర్ నగర్, మజీద్‌గడ్డ ప్రాంతాల్లో ఆమె పర్యటించారు. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఇళ్లలోకి నీరు వచ్చాయని, నాలా పొంగి రహదారులపై మురుగునీరు ప్రవహించడంతో తాము ఇబ్బందులు పడ్డామని స్థానికులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే హైడ్రా సిబ్బందిని పిలిపించి నీటి ప్రవాహానికి అడ్డంగా నాలాలో కొట్టుకు వచ్చిన వ్యర్థాలు తొలగింపజేశారు. సమస్యలు, ఇబ్బందులను తన దృష్టికి తీసుకురావాలని ఆమె స్థానికులకు సూచించారు.

ఎన్‌హెచ్ఆర్‌సీ ఎన్జీఓ సంస్థ
రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుల నియామకం

పంజాగుట్ట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ మానవ హక్కుల కమిటీ(ఎన్‌హెచ్ఆర్‌సీ) ఎన్జీఓ సంస్థ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ద్యాగటి హరీష్, బత్తుల రాజశేఖర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా సంస్థ కార్యాలయంలో సంస్థ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మొగుళ్ల భద్రయ్య వారికి సోమవారం నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా హరీష్, రాజశేఖర్ మాట్లాడుతూ తమ నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలపైన పోరాటం చేస్తామని పేర్కొన్నారు.



కెరీర్ ఫెయిర్‌లో సందేహాలు నివృత్తి చేసుకుంటున్న విద్యార్థులు

ఉత్సాహంగా కెరీర్ ఫెయిర్

బంజారాహిల్స్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువుల విషయంలో విద్యార్థులకు పాఠశాల దశ నుంచే అవగాహన అవసరమని మెరీడియన్ స్కూల్ ప్రిన్సిపాల్ పూనం జా అన్నారు. సోమవారం బంజారాహిల్స్ రోడ్డు నెం.7లోని మెరీడియన్ స్కూల్‌లో విద్యార్థుల కోసం కెరీర్ ఫెయిర్ నిర్వహించారు. 100కు పైగా దేశ, విదేశాల్లోని యూనివర్సిటీల ప్రతినిధులు పాల్గొని విద్యార్థులకు అక్కడ లభిస్తున్న కోర్సులతో పాటు ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతియేటా కొత్త కోర్సులు వస్తున్నాయని, వాటి గురించి తెలుసుకుంటూ ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్లుగా విద్యార్థులు కెరీర్‌ను మలుచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మెరీడియన్ విద్యాసంస్థల సీఈవో తేజస్వి బుట్టా, ప్రెసిడెంట్ లలితా నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ రహత్ రషీద్, కెరీర్ కౌన్సిలర్ ఉజ్మా సుల్తానా పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

బేగంపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్‌లోని మోడల్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీ సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో సోమవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. 'తల్లిదండ్రుల(వయోవృద్ధుల)పోషణ-పిల్లల కర్తవ్యం' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీకి పలు పాఠశాలలకు చెందిన సుమారు వంద మంది విద్యార్థులు హాజరయ్యారు. అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి జె.ఎస్.టి.సాయి మాట్లాడుతూ పిల్లలు తల్లిదండ్రుల పోషణను చూడాలన్నారు. కార్యక్రమంలో జె.ప్రసాద్, రాజేంద్ర, లైబ్రేరియన్ హరిబాబు పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీలో విద్యార్థులు



దాడి గురించి పోలీసులకు వివరిస్తున్న ఉపాధ్యాయుడు మధు

ఉపాధ్యాయుడిపై గుర్తు తెలియని వ్యక్తుల దాడి

అమీర్‌పేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): విధులు ముగించుకుని ఇంటికి తిరిగి వస్తున్న ప్రభుత్వ గణిత ఉపాధ్యాయుడు బెల్లపుకొండ మధు(59) పై సోమవారం గుర్తుతెలియని ఆగంతుకులు దాడి చేశారు. పాఠశాల నుంచి ఇంటికి వస్తున్న క్రమంలో బైక్ వెంబడించిన ఇద్దరు యువకులు అడ్డగించి తీవ్రంగా కొట్టారు. సనత్‌నగర్ డివిజన్ జెక్ కాలనీలో నివాసం ఉంటున్న మధు వెంగళరావునగర్ ప్రభుత్వ పాఠశాలలో విధులు ముగించుకుని సోమవారం సాయంత్రం 5 గంటలకు తన ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. సుందర్‌నగర్ ప్రాంతంలో బైక్ పై వచ్చిన ఇద్దరు యువకులు అడ్డగించారు. ఏమిటని ప్రశ్నించిన ఉపాధ్యాయుడిని తీవ్రంగా కొట్టి పారిపోయారు. కన్ను, ముఖంపై తీవ్ర గాయాలు కావడంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఆర్‌నగర్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. బాధితుడిని ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నామని పోలీసులు తెలిపారు. ఆగంతుకులు తనపై కావాలనే దాడి చేసినట్లు కనిపిస్తుందని, బాధితుడు మధు అనుమానం వ్యక్తం చేశారు.

శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్ తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వెంగళరావునగర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సుమారు 50 సంవత్సరాల క్రితం వెంగళరావునగర్ కాలనీ ఏర్పడ్డప్పుడు స్థానికుల అవసరాల నిమిత్తం ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మించారు. ప్రస్తుతం ఆ ట్యాంక్ శిథిలావస్థకు చేరింది. తరుచూ పై నుంచి పెచ్చులు ఊడి పడుతున్నాయి. నీటి సరఫరా నిలిపివేసినప్పటికీ ఎప్పుడు కులుతుందో తెలియక స్థానికులు భయాందోళన చెందుతున్నారు. నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్ తొలగించి స్థానికుల అవసరానికి కేటాయించాలని కాలనీ సంక్షేమ సమితి ప్రతినిధులు, కాలనీ వాసులు కోరుతున్నారు. 'ఆంధ్రజ్యోతి'లో కూడా శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్‌పై పలుమార్లు కథనాలు ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనికి అధికారులు స్పందించారు. సోమవారం వాటర్ ట్యాంక్ వద్ద అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలు, పిచ్చి మొక్కలను తొలగించి చదును చేశారు. కొద్దిసేపు విద్యుత్ సరఫరాను కూడా నిలిపివేశారు. రాత్రి వర్షం పడడంతో పనులను తాత్కాలికంగా నిలిపివేశారు. పక్కనున్న భవనాలు, ఇతర కట్టడాలు దెబ్బతినకుండా మంగళవారం ఉదయం భారీ ఎక్స్‌కవేటర్లు, క్రేన్‌ల సహాయంతో వాటర్ ట్యాంక్‌ను తొలగిస్తామని హైడ్రా అధికారులు చెప్పారు. ట్యాంక్ తొలగించిన తర్వాత అందులో గ్రంథాలయం, వయోవృద్ధుల కోసం రీక్రియేషన్ గదులు నిర్మించాలని, స్థానికుల అవసరాల కోసం ఆ ప్రదేశాన్ని తీర్చిదిద్దాలని కాలనీ సంక్షేమ సమితి అధ్యక్షుడు చిలకల వెంకటేశ్వరరావు అధికారులకు విజ్ఞప్తి చేశారు. బీజేపీ వెంగళరావునగర్ డివిజన్ అధ్యక్షుడు ఎస్.నవీన్ కుమార్, నాయకులు సుప్రియాగౌడ్, జబ్బార్, శివకుమార్, శ్యామ్, తదితరులు సందర్శించి ట్యాంక్ తొలగించిన తర్వాత ఖాళీ స్థలం అన్యాక్రాంతం కాకుండా చుట్టూ ప్రహరీ నిర్మించాలని, స్థానికుల అవసరాల కోసం కేటాయించాలని అధికారులను కోరారు.



శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్‌ను తొలగించేందుకు చెట్లు, చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

బంజారాహిల్స్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయని, ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. పారిశుధ్యం విషయంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. బంజారాహిల్స్‌లోని అంబేడ్కర్‌నగర్, ఉదయ్‌నగర్ బస్తీల్లో మేయర్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి తదితరులతో కలిసి సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వ్యర్థాల తొలగింపులో నిర్లక్ష్యం ప్రదర్శించే పారిశుధ్య సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బస్తీల్లో నిర్మాణ వ్యర్థాలు ఇష్టారీతిన పడేసే వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు. అంబేడ్కర్ నగర్‌లో నాలా వద్ద కొంతభాగం కూలిన రక్షణ వాల్ వద్ద ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా తక్షణమే ప్రత్యామ్నాయ రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. మహేశ్వరి టవర్స్ ప్రాంతంలో ఇటీవలే రోడ్డుపైన స్లాబ్ కుంగిపోయి, ట్యాంకర్ భూమి లోపలికి కూరుకుపోయిన ప్రదేశాన్ని మేయర్ పరిశీలించారు. 19 మీటర్ల మేర ఆర్‌సీసీ స్లాబ్ నిర్మాణానికి రూ.65 లక్షల నిధులు మంజూరయ్యాయని, వెంటనే పనులు ప్రారంభించి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ రత్నాకర్, డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్‌నగర్ బస్తీలో పర్యటిస్తున్న మేయర్ విజయలక్ష్మి, జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి



స్వామి వివేకానంద విగ్రహాన్ని శుభ్రం చేసిన బీజేపీ నాయకులు




ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ కార్యకర్తలు


ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురవేయాలి

ఖైరతాబాద్/ఎర్రగడ్డ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బీజేపీ అధిష్ఠానం పిలుపునిచ్చిన హర్ ఘర్ తిరంగా నినాదం ప్రకారం ప్రతి ఒక్కరూ ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురవేయాలని కోరుతూ ఆ పార్టీ కార్యకర్తలు సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ ఖైరతాబాద్ డివిజన్ అధ్యక్షుడు ఆదర్శ్ వంశీకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీ లక్ష్మీనగర్, ఖైరతాబాద్ మార్కెట్, బడా గణేశ్, న్యూ సీఐబీ క్వార్టర్స్, ఇందిరానగర్, మహాభారత్‌నగర్ ప్రాంతాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా బీజేపీ నగర ఉపాధ్యక్షుడు ఎన్.ప్రేమ్‌రాజ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఈసారి ఆపరేషన్ సింధూర్‌ను విజయవంతంగా నిర్వహించి భారతదేశ సత్తాను ప్రపంచ దేశాలకు చాటిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రతీ ఒక్కరు ఇళ్లపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి జాతి సమైక్యతను చాటాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామ్మోహన్‌రావు, చంద్రబాబా, వీణామాధురి, యువమోర్చా నాయకులు పాల్గొన్నారు.

- ఎర్రగడ్డ కళ్యాణ్ నగర్ వెంచర్ త్రీలోని స్వామి వివేకానంద విగ్రహాన్ని బీజేపీ నాయకులు శుభ్రం చేశారు. ఆ పార్టీ సెంట్రల్ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు సునీత మాట్లాడారు. ప్రతీ ఒక్కరూ జాతి సమైక్యత, సమగ్రతలను కాపాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శ్రీనివాసరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు రాజేష్, నాయకులు దర్శనం నాగేశ్వరరావు, దేరంగుల ప్రసన్న, ఎర్రగడ్డ డివిజన్ అధ్యక్షుడు బొట్ల విజయకుమార్, నాయకులు గణేశ్, ఎస్ఎల్ దీపక్ ముదిరాజ్, దుర్గారాజ్, చిన్న, నరసింహారావు, రీనా, టి.సునీత, సుజాత పాల్గొన్నారు.



విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందులు వేస్తున్న కార్పొరేటర్ మహేశ్వరి



నులి పురుగుల నివారణ మందులు వేస్తున్న కార్పొరేటర్ విజయారెడ్డి

నులిపురుగుల నివారణ మందులు పంపిణీ

బేగంపేట/ఖైరతాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందులు పంపిణీ చేశారు. బేగంపేటలోని మహర్షి పాఠశాల విద్యార్థులకు కార్పొరేటర్ టి.మహేశ్వరి, ఖైరతాబాద్ నిశుల్క్ ప్రభాత్ పాఠశాల విద్యార్థులకు కార్పొరేటర్ విజయారెడ్డి మందులు వేశారు. ఖైరతాబాద్ యూపీహెచ్‌సీ డాక్టర్ మస్రత్ హుస్సేన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



సైబర్ హిల్స్ కాలనీ నుంచి కాకతీయ హిల్స్ వెళ్లే ప్రధాన రహదారిలో శిథిలమైన మ్యాన్‌హోల్

- హైటెక్‌సిటీ, ఆంధ్రజ్యోతి



సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

జూనియర్ లెక్చరర్ల నియామకాలను రద్దు చేయాలి

పంజాగుట్ట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ విరుద్ధంగా క్రమబద్ధీకరించబడిన 3,500 మంది జూనియర్ లెక్చరర్ల నియామకాలను రద్దు చేయాలని రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల నిరుద్యోగులు-నిరుద్యోగుల జేఏసీ డిమాండ్ చేసింది. 2011లో కాంట్రాక్ట్ పద్ధతిలో నియమింపబడిన జూనియర్ అధ్యాపకుల క్రమబద్ధీకరణలో రాజ్యాంగ ఉల్లంఘన జరిగిందని జేఏసీ నాయకులు ఆరోపించారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్స్‌ను పాటించలేదని, వీరి తర్వాత డైరెక్టర్ రిక్రూట్‌మెంట్ ద్వారా నియమింపబడిన వారిని కూడా రోస్టర్ పాయింట్‌లో వీరి తర్వాత పెట్టడం దుర్మార్గమని వారు పేర్కొన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జేఏసీ నాయకులు శంకర్, జనార్దన్, ఇంద్రనాయక్, కుమార్, రాము తదితరులు మాట్లాడారు. కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లను రెగ్యులరైజ్ చేసే క్రమంలో అప్పటి యూనియన్ నాయకుడి ప్రమేయం ఉందని, పెద్దఎత్తున డబ్బులు చేతులు మారాయని ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జేఏసీ నాయకులు సోమేష్, అర్జున్, చందర్, నవీన్ పట్నాయక్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ జి.గోపీ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 11కేవీ చిరాన్ ప్యాలెస్ ఫీడర్ పరిధిలోని బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12, మిథిలానగర్, మేయర్ విజయలక్ష్మి ఇంటి ప్రాంతాల్లోనూ, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11కేవీ గౌరీశంకర్ కాలనీ ఫీడర్ పరిధిలోని గౌరీశంకర్ కాలనీ, సరస్వతి నగర్, ఉద్యోగనగర్ ప్రాంతాల్లోనూ విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.

15న రక్తదాన శిబిరం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తలసీమియా రోగుల కోసం రోటరీ క్లబ్ ఆఫ్ సైనిక్‌పురి, సికింద్రాబాద్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. బేగంపేటలోని కంట్రీ క్లబ్‌లో ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 2:30 గంటల వరకు జరిగే ఈ శిబిరంలో మానవతావాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని రొటేరియన్ పి.సురేష్ పిలుపునిచ్చారు. రక్తదాతలకు ప్రశంసాపత్రంతో పాటుగా ఆరోహీ బ్లడ్ సెంటర్ నుంచి ధ్రువీకరణ పత్రం ఇస్తామని ఆయన తెలిపారు. ఆసక్తి కలిగిన రక్తదాతలు 98665 56105కు కాల్ చేయడం ద్వారా అదనపు సమాచారం పొందవచ్చని ఆయన తెలిపారు.

ఇంటర్‌లో స్పాట్ అడ్మిషన్లు

బోరబండ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): బోరబండలోని తెలంగాణ రాష్ట్ర బాలుర గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూపులో ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ ఓసీ వారికి, బైపీసీ ఇంగ్లిష్ మీడియంలో ఖాళీగా ఉన్న సీట్లకు స్పాట్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ గోపిశెట్టి రమణమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతిలో 450 మార్కులు, ఆ పైన వచ్చిన వారికి అవకాశం ఉంటుందని, ఆసక్తి గల వారు ఈనెల 15వ తేదీ వరకు కళాశాలకు వచ్చి దరఖాస్తులు ఇవ్వాలని కోరారు. ఇతర వివరాలకు 7330908473లో సంప్రదించాలని ఆమె సూచించారు.

బోరబండ కళాశాలకు సొంత భవనం నిర్మించాలి

బోరబండ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): బోరబండ ప్రభుత్వ కళాశాలకు సొంత భవనం నిర్మించాలని ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు లెనిన్ గువేరా, జూబ్లిహిల్స్ కార్యదర్శి సునీల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణిలో డీఆర్వో వెంకటాచారికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు జగదీష్, అనురాగ్, చందు, శ్రీహరి, నందకుమార్ పాల్గొన్నారు.

ఘనంగా ఉర్సు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్, జంపన ప్రతాప్

బోయినపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : కంటోన్మెంట్ ఒకటో వార్డు పరిధిలోని బోయినపల్లి కడక్‌పురలోని హజ్రత్ సయ్యద్ మిస్కిన్ షా ఖాద్రి దర్గా ఉర్సును బోయినపల్లిలో ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ ముఖ్య అతిథులుగా హాజరై చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో దర్గా నిర్వాహకులు అన్వర్ నబ్రి, ఇర్ఫాన్ నబ్రి, మహమ్మద్ ఐజాజ్ షా ఖాద్రి, హస్మత్ హుస్సేన్, సయ్యద్ ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.



స్థానికులతో సమస్యలపై మాట్లాడుతున్న కార్పొరేటర్ సామల హేమ తదితరులు

అభివృద్ధి పనుల పరిశీలన : కార్పొరేటర్

బౌద్ధనగర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ మేడిబావి, ఇందిరానగర్‌కాలనీలో సోమవారం స్థానిక కార్పొరేటర్ సామల హేమ అధికారులతో కలిసి పర్యటించారు. మేడిబావిలో డ్రైనేజీ ఓవర్‌ఫ్లో అవుతూ మురుగు రోడ్లపైకి వస్తుందని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని కార్పొరేటర్ జలమండలి అధికారులను ఆదేశించారు. రోడ్లపై ఉన్న గుంతలను వెంటనే పూడ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఐఆర్‌టీ వాహనాలు ఎప్పటికప్పుడు డ్రైనేజీలో మట్టిని తొలగించేవని, జెడ్‌ప్యాచర్ వాహనాలు గుంతలను పూడ్చేవని ప్రస్తుతం ఆ వాహనాలను హైడ్రాకు అప్పగించారని, హైడ్రా వాహనాలు సీతాఫల్‌మండి డివిజన్‌లో ఎక్కడా కనిపించటంలేదని ఆమె విమర్శించారు. అనంతరం మేడిబావి శాఖ గ్రౌండ్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. సుమారు నలభై లక్షల రూపాయల వ్యయంతో ఈ పనులు చేపట్టామని, చిన్నపిల్లలు, పెద్దలకు ఉపయోగపడే విధంగా పార్కు పనులు మొదలుపెట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్, జలమండలి ఇన్‌స్పెక్టర్ వజ్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ అరెస్టు ప్రజాస్వామ్యంపై దాడి

● ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర నాయకుడు రషీద్

తిరుమలగిరి ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రజాస్వామ్య చరిత్రలో మరో నల్లరోజు ఆవిష్కృతమైందని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర నాయకుడు రషీద్ ఆరోపించారు. సోమవారం బొల్లారంలోని ఎన్ఎస్‌యూఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీని అక్రమంగా అరెస్ట్ చేసిన ఘటనను తీవ్రంగా ఖండించారు. అవినీతి, అన్యాయాలపై గళమెత్తే స్వరాన్ని అణచివేయడానికి బీజేపీ చేస్తున్న ఈ చర్యలు, వారి భయాన్ని బహిర్గతం చేస్తున్నాయని అన్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలు, స్వేచ్ఛా భావాల రక్షణ కోసం ఈ పోరాటంలో రాహుల్‌తో భుజం కలుపుతూ నిలుస్తామన్నారు.



బదిలీపై వెళుతున్న ఏఎస్ఐ, హోంగార్డు ఆఫీసర్‌తో ఏసీపీ శంకర్ రాజు, ఎస్సై సతీష్, సిబ్బంది

పోలీసులకు అంకితభావం ఉండాలి : ఏసీపీ

రెజిమెంటల్‌బజార్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): విధుల పట్ల అంకితభావం, క్రమశిక్షణ ఉద్యోగంలో రాణించడానికి బాటలు వేస్తుందని నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు అన్నారు. సోమవారం గోపాలపురం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఐదు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళుతున్న ఏఎస్ఐ ప్రమీల, హోంగార్డు ఆఫీసర్ శ్రీకాంత్‌లను సన్మానించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ పోలీసులు విధి నిర్వహణలో ప్రజలతో మర్యాదపూర్వకంగా, సహనంతో నడుచుకోవటంతో పాటు ఉన్నతాధికారుల ఆదేశాలు పాటిస్తే పోలీసుశాఖ ఖ్యాతి పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సతీష్ రెడ్డి, హోంగార్డు ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ మహిళా అథ్లెట్‌గా శుభశ్రీ



ఉత్తమ మహిళా అథ్లెట్ శుభశ్రీకి పురస్కారం అందజేస్తున్న జీఎం సంజయ్ శ్రీవాత్సవ

చిలకలగూడ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): 32వ ఆల్ ఇండియా ఆర్పీఎఫ్ అథ్లెటిక్స్ పోటీల్లో చక్కని ప్రతిభతో జంగా శుభశ్రీ ఉత్తమ క్రీడాకారిణిగా బహుమతి గెలుచుకుంది. షాట్‌పుట్, డిస్కస్ త్రోలలో బంగారు పతకం, 100 మీటర్ల రిలేలో మూడోస్థానం సాధించింది. దక్షిణమధ్య రైల్వే, సికింద్రాబాద్, హెడ్ క్వార్టర్స్ ఆర్పీఎఫ్ ఎ కాయ్ విభాగంలో ఆమె విధులు నిర్వహిస్తుంది. మూడు రోజులు పాటు నిర్వహించిన ఈ పోటీల్లో భారతీయ రైల్వేలోని 17జోన్ల నుంచి 232 మంది క్రీడాకారులు, 25 విభాగాల్లో వివిధ పోటీల్లో 60మంది మహిళ క్రీడాకారులు పాల్గొన్నారు. ఆదివారం జరిగిన ముగింపు వేడుకల్లో ద.మ.రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ శ్రీవాత్సవ ముఖ్య అతిథిగా విచ్చేసి విజేతలకి బహుమతులు అందజేశారు.

ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం ప్రతిపాదన

రాజీవ్ రహదారిపై ఖాళీ అవుతున్న దుకాణాలు



సికింద్రాబాద్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రహదారిపై రాష్ట్ర ప్రభుత్వం నిర్మించతలపెట్టిన ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కారణంగా సికింద్రాబాద్ కార్ఖాన నుంచి తూముకుంట వరకు పలు దుకాణాలు ఖాళీ అవుతుండడంతో యజమానులు లబోదిబోమంటున్నారు. వందల సంఖ్యలో 'టు లెట్' బోర్డులు దర్శనమిస్తున్నాయి. జింఖాన మైదానం నుంచి తూముకుంట వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించడం, ఇందుకు అవసరమైన స్థలాలు ఇవ్వడానికి దాదాపు ఏడాది క్రితం కేంద్ర రక్షణశాఖ అంగీకరించింది. దాంతో కారిడార్ నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం దూకుడు పెంచింది. ఈ నేపథ్యంలో రహదారికి ఇరువైపులా ఉన్న వర్తక, వాణిజ్య సముదాయాలు, దుకాణాలు క్రమేణా ఖాళీ అవుతున్నాయి. మొత్తం రహదారిని 200 అడుగుల మేరకు విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించగా, 100-120 అడుగుల మేరకు విస్తరిస్తే సరిపోతుందని, తద్వారా తమకు కూడా అధిక నష్టం కలగదని రాజీవ్ రహదారి ప్రాపర్టీస్ ఓనర్స్ జేఏసీ ప్రతినిధులు చెబుతున్నారు. ఈ మేరకు కేంద్ర రక్షణ శాఖ ఉన్నతాధికారులకు, రాష్ట్ర ప్రభుత్వ పెద్దలకు మొర పెట్టుకుంటున్నారు. అయితే ఇప్పటి వరకూ ఈ విషయమై ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పష్టత రాలేదు. దాంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినట్టుగానే విస్తరణ జరుగుతుందన్న ఆందోళన యజమానులకు కలుగుతుండగా, విస్తరణ ఖాయమని తేలినందున ఇతర ప్రాంతాలకు వ్యాపారాన్ని మార్చుకోవాలన్న ఆలోచనతో దుకాణాలను కిరాయిదారులు ఖాళీ చేస్తున్నారు. వారి స్థానంలో కొత్తవారు రాకపోవడంతో నెలల తరబడి దుకాణాలకు 'టు లెట్' బోర్డులు వేలాడుతున్నాయి.







దుకాణాలకు పెట్టిన టూలెట్ బోర్డులు

వినాయక ఉత్సవాల సందడి షురూ

● వారాసిగూడలో గణేష్ ఆగమన్
● ఉగ్ర నర్సింహస్వామి అవతారంలో గణనాథుడు



వారాసిగూడ చౌరస్తాలో ఆగమన్‌తో మండపానికి తీసుకువెళుతున్న గణనాథుడు

బౌద్ధనగర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలో గణేష్ నవరాత్రోత్సవాల సందడి మొదలైంది. వినాయకుడికి స్వాగతం పలుకుతూ నగరంలో మొట్టమొదటిసారిగా బౌద్ధనగర్‌లోని నేతాజీ ఫ్రెండ్ అసోసియేషన్ నిర్వాహకులు ఆగమన్‌ను నిర్వహించారు. సుమారు మూడున్నర లక్షల రూపాయలతో కొనుగోలు చేసిన ప్రత్యేక అలంకరణలో ఉన్న వినాయకుడి విగ్రహాన్ని ఆదివారం రాత్రి చిలకలగూడ చౌరస్తా నుంచి బౌద్ధనగర్‌లో మండపం వరకు ర్యాలీతో తీసుకువెళ్లారు. ఉగ్ర నర్సింహస్వామి అవతారంలో ఉన్న భారీ వినాయకుడు భక్తులను ఆకట్టుకున్నాడు. నవరాత్రోత్సవాలు పదిహేనురోజులుండగానే ఆగమన్ సందడి నెలకొంది. స్థానికులు ఆగమన్‌ను తిలకించటానికి వారాసిగూడ చౌరస్తాకు వచ్చారు. చిలకలగూడ డివిజన్ ఏసీపీ శశాంక్‌రెడ్డి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్లు అనుదీప్(చిలకలగూడ), మధుసూదన్‌రెడ్డి(వారాసిగూడ) బందోబస్తును ఏర్పాటు చేశారు.

నేతాజీ ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రధాన నిర్వాహకుడు విష్ణుతేజ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుళ్ల పద్మారావుగౌడ్, సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్, బీజేపీ ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పి.సంజీవ ముదిరాజ్, యువ నాయకులు తీగుళ్ల రామేశ్వర్‌గౌడ్, ఆదం సృజన్, మాజీ కార్పొరేటర్ కందినారాయణ, జనజాగృతి శ్రీనివాస్‌తో పాటు సభ్యులు సాయి కిరణ్, సమంత్, రఘు, కార్తీక్, వర్షిత్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

అకారణంగా ఉద్యోగం నుంచి తొలగించారు

● ఎంపీ కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేత ● ప్రజావాణిలో ఫిర్యాదు



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బాధితురాలు జ్యోతి

అడ్డగుట్ట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో ఇరవై ఏళ్లుగా ఔట్ సోర్సింగ్ విభాగంలో పనిచేస్తున్న జ్యోతి అనే మహిళను అకారణంగా ఉద్యోగంలో నుంచి తొలగించారని బాధితురాలు సోమవారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. అంతకుముందు ఆమె ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధితురాలు మాట్లాడుతూ గాంధీ ఆస్పత్రిలో ఇరవై ఏళ్లుగా పనిచేస్తున్నానని, ఆస్పత్రిలో పనిచేస్తున్న ఒకరు అకారణంగా ఉద్యోగంలో నుంచి తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎందుకు తొలగించారని ప్రశ్నిస్తే సమాధానం లేదని, హెల్త్ ఇన్‌స్పెక్టర్‌ను అడిగితే సూపరింటెండెంట్‌ను అడగాలని, సూపరింటెండెంట్ రాజకుమారిని కలిస్తే తెలియదని చెబుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. కనీసం నాపై ఎలాంటి ఆరోపణలు వచ్చాయని అడిగితే కూడా ఎవరూ చెప్పకపోవడంతోనే ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన అనంతరం ఎంపీ కిషన్‌రెడ్డిని కలిసి క్లుప్తంగా తన బాధను తెలియచేశానని అన్నారు. వెంటనే స్పందించిన కేంద్ర మంత్రి సూపరింటెండెంట్‌కు సిఫార్సు చేస్తూ లెటర్ ఇచ్చారని ఆమె తెలిపింది. ఇరవై ఏళ్లుగా పనిచేస్తున్న తనకు ఆస్పత్రిలో అన్యాయం జరిగిందన్నారు. వెంటనే తనను ఉద్యోగంలోకి తీసుకోవాలని కోరుతుంది.

ఎస్సీ వర్గీకరణను సవరించాలి

● మాల స్టూడెంట్ జేఏసీ డిమాండ్

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను, రోస్టర్ పాయింట్లను సవరించాలని మాల స్టూడెంట్ జేఏసీ ఛైర్మన్ మాదాసు రాహుల్‌రావు డిమాండ్ చేశారు. 1997 ఆగస్టు 11న ట్యాంక్ బండ్‌పై అమరులైన మాల అమరవీరుల త్యాగలను స్మరించుకుంటూ మాల స్టూడెంట్ జేఏసీ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ వేదికగా వారికి సోమవారం నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం తీరుకు వ్యతిరేకంగా, మాల అమరవీరుల వీరత్వాన్ని స్ఫూర్తిని కొనసాగిస్తూ ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ బద్ధంగా, రోస్టర్ పాయింట్లలో సవరణ జరిగే వరకూ ఈ పోరాటాన్ని కొనసాగిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో మాల సంఘాల జేఏసీ గౌరవ ఛైర్మన్ చెరుకు రామచంద్రం, గ్రేటర్ హైదరాబాద్ మాల సంఘాల జేఏసీ ఛైర్మన్ బేరే బాలకిషన్, ఓయూ అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ ఉదయ్, మాల యూత్ ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ వీరాస్వామి, అంసా ఓయూ అధ్యక్షులు నామా సైదులు, మాల స్టూడెంట్ జేఏసీ గ్రేటర్ హైదరాబాద్ ప్రెసిడెంట్ దిలీప్, ఓయూ సెక్రటరీ రమేష్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా అభియాన్

అడ్డగుట్ట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) :హర్‌ఘర్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం బీజేపీ అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షురాలు గాజుల సౌందర్య ఆధ్వర్యంలో భారతదేశ స్వాతంత్ర పోరాట యోధుడు సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు ఆదేశాల మేరకు దేశ స్వాతంత్రం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను యువతకు తెలియజేయాలనే ఉద్దేశంతోనే హర్‌గర్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ బోర్డు సభ్యుడు కన్నాభిరాం, డివిజన్ ప్రధాన కార్యదర్శి సాయన్న, హరి శివప్రసాద్, యువ నాయకుడు ఉదయ్‌కుమార్ యాదవ్, కృష్ణ, శివలింగం, వీరేశం, ప్రసాద్, కళావతి, రాజు, వసంత, శివాజీ, హంసరాజు, స్వామి, శ్రీనివాస్, రమేష్, సాయి, ప్రసాద్, శ్యామ్‌లు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మందులు పంపిణీ

బేగంపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా బేగంపేటలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు నులిపురుగుల నివారణ టాబ్లెట్లను పంపిణీ చేశారు. అందులో భాగంగా మహర్షి స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్పొరేటర్ టి.మహేశ్వరి పాల్గొని విద్యార్థులకు ఆల్బెండజోల్ టాబ్లెట్లను వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నులిపురుగుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యంతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



ఆహ్వానం

రసూల్‌పురా బీఆర్ఎస్ మైనారిటీ నాయకుడు గౌస్, ఆయన అనుచరులు సోమవారం పికెట్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి శ్రీగణేష్ సాదరంగా ఆహ్వానించారు. నాయకులు రఫిక్, నరేష్, మల్లేష్, నాగేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

- సికింద్రాబాద్, ఆంధ్రజ్యోతి



నూతన అధ్యక్షుడు, సభ్యులను సత్కరిస్తున్న సంఘం నాయకులు

పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం

బౌద్ధనగర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): బౌద్ధనగర్ డివిజన్ సంజీవపురం పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షుడిగా హనుమన్న బాలరాజ్, ప్రధాన కార్యదర్శిగా తాటికొండ చంద్రశేఖర్, కోశాధికారిగా ఎస్ఎస్ చక్రధర్, ఉపాధ్యక్షులుగా ఎన్.నవీన్‌కుమార్, కార్యదర్శిగా చెరిపల్లి శ్రీకాంత్ నియమితులయ్యారు. వీరిని గౌరవ సలహాదారు చిక్కా దేవదాస్, మాజీ అధ్యక్షుడు వనమాల భాస్కరరావులు సత్కరించారు.



ఆదిపరాశక్తి దేవాలయంలో పూజలు చేసిన నాగనేని సరిత

ముగిసిన శ్రావణమాస బోనాలు

తిరుమలగిరి ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరిలోని పలు అమ్మవారి దేవాలయాల్లో రెండు రోజుల పాటు జరిగిన శ్రావణమాసం బోనాలు సోమవారం ముగిసాయి. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు నాగనేని సరిత అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. నిర్వాహకులు ఆమెకు తీర్థప్రసాదాలు అందజేసి, ఆశీర్వచనాలు అందించారు.



నృత్య పోటీల్లో అవార్డును అందుకున్న చిన్నారులు

చిన్నారులకు ప్రతిభ అవార్డులు

అడ్డగుట్ట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : రవీంద్రభారతిలో నిర్వహించిన వివిధ సాంస్కృతి కల్చరల్ నృత్యాల పోటీలో తుకారాంగేట్‌కు చెందిన బాలకృష్ణ, భారతి దంపతుల కుమార్తెలు అక్షర, నిక్షిత, నువాన్‌లు ప్రతిభ అవార్డు పొందారు. ఆర్య వైశ్యసంఘం కార్పొరేషన్ ఛైర్మన్ కొంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో విజేతలకు అవార్డులను అందజేశారు. 'బృందావనం కృష్ణుడు వచ్చాడే' అంటూ పాటపై నృత్యం చేశారు.

ఫ్యాన్సీ డ్రెస్‌లతో చిన్నారుల సందడి

రెజిమెంటల్‌బజార్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కిండర్ గార్టెన్ చిన్నారులకు ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్ నిర్వహించారు. సోమవారం సికింద్రాబాద్ సెయింట్ పాట్రిక్స్ స్కూల్‌లో జరిగిన ఈ పోటీల్లో చిన్నారులు పండ్లు, కూరగాయలు, స్వాతంత్ర్య సమరయోధులు, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యకరమైన ఆహారం, దేశభక్తి తదితర అంశాలను ప్రతిబింబించేలా దుస్తులు ధరించి ఆకట్టుకున్నారు. పర్యావరణ పరిరక్షణ, నీటి ఆదా, సమతుల ఆహారంపై చిన్నారుల స్పీచ్ అందరినీ ఆలోచింపచేసింది.

రైళ్లలో చోరీలు.. నిందితుడి అరెస్టు

● గౌతమి, సింహపురి ఎక్స్‌ప్రెస్ రైళ్లలో చోరీలు
● సొత్తుతో క్రికెట్ బెట్టింగ్



పోలీసుల అదుపులో నిందితుడు, స్వాధీనం చేసుకున్న నగలు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : రైళ్లలో నగల చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని సికింద్రాబాద్ రైల్వే పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. అతడి నుంచి బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్న రైల్వే పోలీసులు.. సోమవారం సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సికింద్రాబాద్ రైల్వే డీఎస్పీ జావీద్, సికింద్రాబాద్ రైల్వే ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్‌లు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ సూరారం జీడిమెట్ల ప్రాంతానికి చెందిన కోరుప్రోలు లవరాజు(23) జీడిమెట్లలోని ఓ కంపెనీలో జూనియర్ కెమిస్ట్‌గా పనిచేస్తున్నాడు. ఏపీలోని శంఖవరం ప్రాంతానికి చెందిన ఇతడు రెండేళ్ల క్రితం హైదరాబాద్‌కు బతుకుదెరువు కోసం వచ్చి జీడిమెట్ల పారిశ్రామిక సమీపంలో జీవనం సాగిస్తున్నాడు. తాగుడికి బానిసైన అతడు జల్సాలకు అలవాటు పడ్డాడు. వచ్చిన జీతంతో ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ ఆడుతుండేవాడు. క్రికెట్ బెట్టింగ్‌లో పెట్టిన డబ్బులు చేతికి రాకపోవడంతో చేతిలో డబ్బు లేకుండాపోయింది. కొద్దిరోజుల క్రితం సొంత ఊరుకు వెళ్లి తిరిగి సికింద్రాబాద్‌కు వస్తుండగా సులువుగా డబ్బు సంపాదించాలంటే రైళ్లలో మహిళల మెడలో ఉన్న బంగారు నగలను దొంగిలించాలనే ఆలోచన వచ్చిన లవరాజు ఫిబ్రవరి 26న సింహపురి ఎక్స్‌ప్రెస్ రైలులో మహిళ మెడలో నగలు, ఆగస్టు 2న గౌతమి ఎక్స్‌ప్రెస్ రైలులో మహిళ మెడలో నుంచి నగలు తెంపుకుని పారిపోయాడు. నగలు విక్రయించిన డబ్బును క్రికెట్ బెట్టింగ్‌లో ఉపయోగించేవాడని డీఎస్పీ తెలిపారు. చోరీ చేసిన బంగారు ఆభరణాలను సూరారం బ్రాంచ్‌లోని ముత్తూట్ ఫిన్‌కార్ప్‌లో తాకట్టు పెట్టేవాడు. ఇలా చోరీలు చేయడం, వచ్చిన డబ్బును క్రికెట్ బెట్టింగ్‌లో పెట్టడం, డబ్బులు అయిపోగానే మరలా చోరీలకు పాల్పడడం అతడి వృత్తిగా మారింది. ఇదే క్రమంలో సోమవారం ఉదయం సికింద్రాబాద్ రైల్వే పోలీసులు, ఆర్పీఎఫ్ పోలీసులు ఎస్సై సుబ్బారెడ్డి, సుఖ్‌దేవ్, వేణుగోపాల్ స్వామి, భవాని శంకర్, వినోద్ కుమార్, సింగ్, హరిలాల్‌లు కలిసి తనిఖీలు చేస్తుండగా ఆ సమయంలో రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదస్థితిలో తిరుగుతున్న లవరాజును అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో రైళ్లలో చోరీలు చేస్తానని అంగీకరించడంతో నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. నిందితుడి నుంచి రూ7.70 లక్షల విలువైన 77 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. మీడియా సమావేశంలో సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ సీఐ సరస్వత్, గోవింద్‌నాయుడులు ఉన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

● మహాధర్నాకు బీఆర్ఎస్వీ పిలుపు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్వీ సెప్టెంబర్ 19న మహాధర్నాకు పిలుపునిచ్చింది. సోమవారం ఓయూ లోని ఆర్ట్స్ కాలేజీ వద్ద బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుంగ బాలు వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొంపెల్లి నరేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండేండ్లు కావస్తున్నా ఇప్పటి వరకు విద్యాశాఖ మంత్రిని నియమించిపోవడం శోచనీయమన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.8 వేల కోట్ల పైచిలుకు స్కాలర్ షిప్‌లను విడుదల చేయకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులను పీడించి డబ్బులు వసూళ్లు చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 19న ఓయూ ఆర్ట్స్ కాలేజీ వేదికగా మహాధర్నాకు పిలుపునిస్తున్నామని పేర్కొన్నారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు ఎం. రమేష్, మల్లేష్, సురేష్, పృథ్వీ అచ్యుతు రమేష్, సందానంద్, ప్రవీణ్, అరవిందు, శివ శంకర్, సందీప్, కిరణ్, వంశీ పాల్గొన్నారు.